క్లుప్తంగా

200 మందికి భోజనం..



భోజనం పంపిణీ చేస్తున్న జ్యోతి, కిషోర్

విజయనగరం ఫోర్ట్: ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం పురస్కరించుకుని సెయింట్ ఆన్స్ గరల్స్ ఆఫ్ ఫార్మసీ ఇన్‌చార్జి జ్యోతి, ప్రిన్సిపాల్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 200 మందికి శనివారం భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్ఞానమ్మ కమిటీ సభ్యులు మాధురి, నీలిమ, డైసీ, కీర్తన, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు టీ షర్టుల పంపిణీ



బధిరులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: అంతర్జాతీయ సాంజ్ఞ భాషా దినోత్సవం సందర్భంగా బధిరులకు ప్రత్యేక టీషర్టులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్ అందజేశారు. జిల్లా కేంద్రంలోని కోలగట్ల నివాసంలో సుమారు 300 మంది బధిరులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో బధిరులకు టీ షర్టులతో పాటు మధ్యాహ్న భోజనం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే నిమజ్జనం

భోగాపురం: వినాయక విగ్రహాలను నిబంధనల మేరకే నిమజ్జనం చేయాలని ఎస్సై ఎస్. కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిమజ్జన కార్యక్రమాల్లో పార్టీ జెండాలు గానీ, పార్టీ పాటలు గాని ప్రదర్శించడానికి వీల్లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా డీజేలు గానీ, అత్యధిక శబ్ద కాలుష్యాన్నిచ్చే సౌండ్ బాక్సులు వినియోగించరాదన్నారు. ఏ చిన్నపాటి సంఘటనలు చోటుచేసుకున్నా కమిటీ సభ్యులదే బాధ్యతన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై సైకిల్ ర్యాలీ



రెడ్‌క్రాస్ సభ్యుల సైకిల్ ర్యాలీ

విజయనగరం: ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రెడ్‌క్రాస్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్, కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మాజీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం



మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

విజయనగరం: జిల్లా కేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన వర్షం గంటపాటు ఏకధాటిగా కురిసింది. ఇదే సమయంలో భారీ శబ్దాలతో పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇదిలా ఉండగా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయం కాగా... వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారంతా ఇబ్బంది పడ్డారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు



మాట్లాడుతున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అంబళ్ల సుధారాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ, ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేయాల్సిన కార్యక్రమాల వివరాలను సిబ్బంది అందుబాటులో ఉంచుకోవాలని కోరారు.

అభివృద్ధి పనుల సందడి....

- ఓ వైపు శంకుస్థాపనలు.. మరోవైపు ప్రారంభోత్సవాలు
- నాలుగు డివిజన్‌లలో రూ.65 లక్షలతో నూతన పనులకు శ్రీకారం
- రెండు డివిజన్‌లలో రూ.34 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులు ప్రారంభం
- కార్యక్రమాల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్లు



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్లు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సందడి వాతావరణం నెలకొంది. నగర అభివృద్ధే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సారథ్యంలో శనివారం ఓ వైపు కొత్త పనులకు శ్రీకారం చుట్టడంలో భాగంగా శంకుస్థాపనలు చేయడంతో పాటు మరోవైపు పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. నగరంలోని ఆరు డివిజన్‌ల పరిధిలో ఉదయం, మధ్యాహ్న సమయాల్లో జరిగిన కార్యక్రమాలతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఇందులో భాగంగా ఉదయం 26, 27, 30, 33 డివిజన్ల పరిధిలో గల కోరాడవీధి, తుపాకుల వీధి, జొన్నగుడ్డి, ధర్మపురి, తోటపాలెం ప్రాంతాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు రూ.65 లక్షలతో నూతనంగా రోడ్లు, కాలువలు నిర్మించేందుకు శంకుస్థాపనలు చేయగా.. మధ్యాహ్నం 37, 47 డివిజన్‌లలో రూ.34 లక్షలతో చేపట్టిన పనులు ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్యక్రమాల్లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్‌లతో పాటు స్థానిక కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ అల్లు చాణక్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సారథ్యంలో విజయనగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందన్నారు. ఇందులో భాగంగానే ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేయడం, డివిజన్‌లలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల విస్తరణ వంటి అనేక కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఎన్నడూ లేనివిధంగా నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందడం మనందరి అదృష్టమన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కోలగట్ల పని చేస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపిస్తే సంక్షేమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పతివాడ గణపతిరావు, దుప్పాడ సునీత, జీవీ రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంఎం షిరాజీ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



పూర్తి చేసిన అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మహాధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వామపక్ష ప్రజా సంఘాల నాయకులు

నెల్లిమర్ల: ఈ నెల 25న జరగనున్న అంగన్‌వాడీ సిబ్బంది మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పలసూరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అమరవీరుల స్మారక భవనంలో వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో ఏపీ అంగన్‌వాడీ, వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. 48 సంవత్సరాలుగా అంగన్‌వాడీ సిబ్బంది ఎన్నో వ్యయప్రయాసలకోర్చి విధులు నిర్వహిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న అంగన్‌వాడీ సిబ్బంది వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగులకు తక్షణమే గ్రాడ్యుటీ అమలు చేయాలని పదవీవిరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచి, పెన్షన్ చివరి వేతనంలో 50 శాతం ఇవ్వాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..



మండల విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌పీలు

పూసపాటిరేగ: సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఆర్పీల రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. గురువులు కోరారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 25న విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరూ సామూహిక సెలవు పెడుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు బి.పాపినాయుడు, ఎ.రాజ్‌కుమార్‌కు శనివారం దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు డీఏ, హెచ్‌ఆర్‌ఏతో కూడిన కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు రాజబాబు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ



ఈవీఎం గోదాంను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని రెండు ఈవీఎం గోదాములను కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. గోదాముల్లో నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన గదులను, వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. రెండు గోదాముల్లోని సీసీ కెమేరాలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. గోదాముల్లోని అనవసర వస్తువులను తక్షణమే అక్కడినుంచి తీసివేయాలని సూచించారు. ఖాళీ గదులన్నింటినీ శుభ్రంచేసి, వినియోగానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తనిఖీల్లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎం.వి సూర్యకళ, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ దేవ్‌ప్రసాద్, నెల్లిమర్ల తహసీల్దార్ డి. ధర్మరాజు, డీటీ శైలజ, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోయిన బ్యాగ్ అప్పగింత



బాధితురాలికి బ్యాగ్, మొబైల్ అప్పగిస్తున్న ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల: పోయిన బ్యాగ్‌ను నెల్లిమర్ల పోలీసులు బాధితురాలికి తిరిగి అప్పగించారు. గరివిడి మండలం తోండ్రంగి గ్రామానికి చెందిన కోడి హేమలత గరివిడి నుంచి విజయనగరం వైపు శనివారం ఆటోలో వస్తూ మొయిద జంక్షన్‌లో దిగిపోయింది. ఈ సమయంలో తన బ్యాగ్, మొబైల్‌ను ఆటోలో మరిచిపోయింది. కొద్దిసేపటి తర్వాత బ్యాగ్, మొబైల్ పోయిన విషయాన్ని గమనించి, నెల్లిమర్ల ఎస్సై పి. నారాయణకు ఫిర్యాదు చేసింది. వెంటనే ఎస్సై స్పందించి ఆటోను గుర్తించి బ్యాగ్, మొబైల్ బాధితురాలికి అప్పగించారు.

ఘనంగా పైడితల్లి చండీయాగం



అమ్మవారి చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న అమ్మవారి ఆలయ ఆవరణలో శనివారం చండీయాగం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించడంతో పాటు అమ్మవారి యాగ ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఈ నెల 30లోగా ఫీజు చెల్లించాలి

డెంకాడ: వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న ఇంటర్ పరీక్షకు ఈనెల 30వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ ఎం.ఆదినారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

నందిగాంలో న్యాయ అవగాహన సదస్సు



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

భోగాపురం: మండలంలోని నందిగాంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. సాయికల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబ వ్యవస్థ బాగుంటేనే సమాజం బాగుంటుందని చెప్పారు. మూడు దశాబ్దాలుగా ఒక్క కేసు కూడా నమోదు కాని ఇలాంటి గ్రామం దేశానికే ఆదర్శమన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ, క్రమశిక్షణకు మారుపేరుగా ఈ గ్రామం ఉందని, ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలోఎన్నో అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం నందిగాంను జిల్లాలో ఉత్తమ ఆదర్శ పంచాయతీగా నిలిపేందుకు కృషి చేసిన సర్పంచ్ గరే మురళీమోహనరావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, సీఐ బీవీ వెంకటేశ్వరరావు, అడ్వకేట్‌లు జి. సత్యం, పి. కుమార్, ఎస్సైలు కృష్ణమూర్తి, మహేష్, సెక్రటరీ రమణమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

'ఉప్పాడ'కు అభినందనలు



సూర్యనారాణరెడ్డిని అభినందిస్తున్న రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లిబోయిన నరసింగరావు

భోగాపురం: వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఉప్పాడ సూర్యనారాయణరెడ్డిని రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లిబోయిన నరసింగరావు, తదితరులు ఉప్పాడపేట పార్టీ కార్యాలయంలో శనివారం అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు వెంకటరమణ, శంకరరావు, చెల్లిబోయిన రాము, కొల్లు రామ్మూర్తి, పతివాడ రామకృష్ణ, దంతులూరి రమేష్‌రాజు, కొల్లి రాంబాబు, వి. గురుమూర్తి, బోయి రమణ, చెల్లిబోయిన అప్పారావు, రమణ, కొయ్య లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



నోట్ పుస్తకాలు చూపుతున్న విద్యార్థులతో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, తదితరులు

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

డెంకాడ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనిని ఉపాధ్యాయులు సమర్థవంతంగా నెరవేర్చాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ అన్నారు. మండలంలోని మోపాడ కేజీబీవీని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థుల సోషల్ నోట్ పుస్తకాలు చూసి అభినందించారు. విద్యార్థులతో ఇంగ్లిష్ చదివించారు. అనంతరం నాడు-నేడు పనులు, సచివాలయం సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ జ్యోతికుమారి, డీఈఓ లింగేశ్వర రెడ్డి, డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు, ఎంఈఓలు వెంకటరమణ, రాధాకృష్ణ, ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నేత్ర పరీక్షలు



విద్యార్థినులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంఘ సభ్యులు

భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘ సభ్యులు, పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి టి. తిరుపతిస్వామి ఆధ్వర్యంలో శనివారం స్థానిక కస్తూరిబా పాఠశాలలోని సుమారు 269 మంది విద్యార్థినులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 22 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం వారికి ఉచితంగా కళ్లజోళ్లు మంజూరు చేసేందుకు జిల్లా అంధత్వ నివారణ సంఘానికి సిఫార్స్ చేశారు. కార్యక్రమంలో ఆప్తాలమిస్ట్ మజ్జి గణపతి, పాఠశాల హెచ్‌ఎం టి. అరుణ, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ గౌరి, ఏఎన్‌ఎంలు అరుణ, రామలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ గిడుతూరి రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సీతారామునిపేట, తమ్మాపురం, దన్నానపేట గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయని, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నెలాఖరులోగా ఈ-క్రాప్ చేసుకోండి

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల సాగు వివరాలను ఈనెలాఖరులోగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని రైతులకు ఏఓ పి.వి.మల్లికార్జునరావు శనివారం ఓ ప్రకటనలో సూచించారు. రైతులు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో వీఏఏలు, వీహెచ్‌ఏలను సంప్రదించి ఆధార్‌కార్డు, వన్‌బీ, లేదా భూమి పాస్‌బుక్ జెరాక్స్ పత్రాలను అందజేస్తే వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఈ-క్రాప్ చేసుకుంటేనే పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అలాగే అతివృష్టి, అనావృష్టికి పంటలు దెబ్బతింటే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని తెలిపారు.

ఎంవీజీఆర్‌లో హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్



ఎంవీజీఆర్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులతో అధ్యాపకులు

డెంకాడ: పరిశ్రమలతో నెట్‌వర్కింగ్‌లో భాగంగా చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దిగ్గజ కంపెనీ ప్రతినిధులతో హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రస్తుత జాబ్‌మార్కెట్‌లో విజయం సాధించడానికి నైపుణ్యాలతో పాటు అవసరమైన లక్షణాలపై అవగాహన కల్పించారు. కళాశాల మూడో సంవత్సరం విద్యార్థులు, అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ నిపుణుడు పొన్నుస్వామి, ఆరుముగం, రత్నవేలు, ఇరుధయరాజ్, తదితరులు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.సీతారామరాజు, రమేష్, ఎం.సునీల్ ప్రకాష్, డీన్ ఎంవీవీ భాను, తదితరులు పాల్గొన్నారు.